క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: నది అగ్రహారంలో ఉన్న 132 కేవీ గద్వాల సబ్ స్టేషన్‌లోని 33 కేవీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 6:30 గంటల నుంచి ఉదయం 9:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతు కారణంగా ఆ ఫీడర్ పరిధిలోని మార్లబీడు, ఉప కేంద్రాలకు కూడ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యా సామగ్రి అందజేత

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బీజేపీ ప్రధాన కార్యదర్శి డీకే సిగ్నారెడ్డి జన్మదినం సందర్భంగా బీజేవైఎం అధ్యక్షుడు మీర్జాపూర్ వెంకటేశ్వర్ రెడ్డి విద్యా సామగ్రిని అందజేశారు. సోమవారం 10వ తరగతి విద్యార్థినులకు పంపిణీ చేసి మాట్లాడారు. కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తరుణ్, హేమకర్, అరుణ్, రాజశేఖర్, రంజిత్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులను కలిసిన తపస్ నాయకులు



మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను సోమవారం తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా ఆ సంఘం జిల్లా నాయకుడు శ్రీధర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు ఏవీఎన్ రెడ్డికి వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో తపస్ సంఘం నాయకులు భాస్కర్, మధు, తిమ్మప్ప, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని జిల్లా పరిషత్, కేజీబీవీ పాఠశాలలు, కళాశాలలో, సోమవారం శాసనమండలి బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, రాజోలి, వడ్డేపల్లి మండలాల అధ్యక్షులు సంజీవరెడ్డి, నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు రంజిత్‌పటేల్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, హరికృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

ఉండవెల్లి: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బొంకూరులో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు కుర్వ నరసింహ(45) గ్రామంలో 10 ఎకరాలలో పత్తి, మిరప, జొన్న పంటలు సాగు చేశాడు. వివిధ ఆర్థిక సమస్యలను తట్టుకోలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రైతు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వేరుశనగ క్వింటా రూ.7,572

గద్వాల వ్యవసాయం: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు సోమవారం 1,848 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. క్వింటా గరిష్ఠంగా రూ.7,572, కనిష్ఠంగా రూ.3,669, సరాసరి రూ.5,600 ధరలు లభించాయి. 147 క్వింటాళ్ల ఆముదంరాగా రూ.6,519-రూ.5,269-రూ. 6,509.. 38 క్వింటాళ్ల కంది రాగా రూ.7,626-రూ.6,089-రూ.7,454.. 3 క్వింటాళ్ల వరి ధాన్యం (సోనారకం) రాగా రూ.1,859 ధర పలికింది.

తెగిన విద్యుత్ తీగలు

గట్టు: మండలంలోని మాచర్ల గ్రామ శివారులో పామాయిల్ తోటపై విద్యుత్ తీగలు తెగి నిప్పు అంటుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధిత రైతు శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పామాయిల్ తోటలోని మెయిన్ లైన్ విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తెగి పడింది. ఈ ఘటనలో గడ్డితో పాటు పామాయిల్ మొక్కలు అంటుకొని బూడదఅయ్యాయి. అదేవిధంగా డ్రిప్పు కూడా పూర్తిగా కాలిందని వాపోయాడు. పక్క పొలాల్లోని రైతులు గమనించిన విద్యుత్ సరఫరాను నిలిపి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

వాహనం బోల్తా.. ఆరుగురికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడులో పండ్లు తరలిస్తున్న వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కర్నూల్ నుంచి పెబ్బేరుకు టాటా ఏస్ వాహనంలో ఆరుమంది ప్రయాణికులతో పండ్లను తరలిస్తున్నారు. అలంపూర్ చౌరస్తాకు రాగానే వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన నేషనల్ హైవే సిబ్బంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ప్యాసెంజర్లకు స్వల్ప గాయాలవడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

నిధులు లేక.. పనులు సాగక

పట్టించుకోని అధికారులు



మట్టి రోడ్డుగానే మిగిలిన సల్కాపురం రోడ్డు

గట్టు: గ్రామాలలో బీటీ రహదారులు ఏర్పాటు చేయాలన్నా సంకల్పంతో ప్రభుత్వం పనులకు శ్రీకారం చుట్టింది. అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే అసంపూర్తిగా వదిలేస్తున్నారు. ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న గ్రామస్తులు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గట్టు నుంచి సల్కాపురం మీదుగా సోంపురం గ్రామం వరకు ఉన్న 8 కిలోమీటర్ల మట్టి రోడ్డును తారురోడ్డుగా మార్చేందుకు 2018లో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.4.40 కోట్లను మంజూరు చేసింది. 2018 జూలైలో కొత్తగా తారు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పనులను కూడా ప్రారంభించారు. రోడ్డును వెడల్పు చేస్తూ, అవసరం ఉన్న చోట కల్వర్టుల నిర్మాణం కూడా చేపట్టి పూర్తి చేశారు. అయితే సల్కాపురం, జోకన్‌గట్టు గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక్కడ బ్రిడ్జి కోసం రోడ్డును తవ్వారు. అయితే బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించకుండానే నిలిపి వేశారు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న నీటి కుంటలో నుంచే ఇప్పటికి రాకపోకలను సాగిస్తున్నారు. వర్షాకాలంలో అయితే ఈ దారి గుండా ప్రయాణించడానికి ఇబ్బంది పడుతున్నామని సల్కాపురం, జోకన్‌గట్టు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్తేందుకు రైతులు నరకయాతన అనుభవిస్తున్నారు. అసంపూర్తిగా వదిలేసిన బ్రిడ్జి నిర్మాణాన్ని తక్షణమే చేపట్టి పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తారురోడ్డు కోసం ఆ గ్రామస్తుల ఎదురు చూపు ఇప్పట్లో తీరేలా కన్పించడం లేదు. ఐదేళ్లుగా తారు రోడ్డు పనులు పెండింగ్‌లోనే ఉండి పోయింది. మట్టిని మాత్రమే వేసి మధ్యలోనే వదిలేశారు. కొత్తగా తారు రోడ్డు మంజూరు కావడంతో సల్కాపురం, జోకగన్‌గట్టు, సోంపురం గ్రామాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అప్పట్లో రోడ్డు పనులు ప్రారంభించడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోష పడ్డారు. అలా వీరి సంతోషం ఎక్కువ రోజులు నిలువ లేదు. ఈ తారు రోడ్డు పనులను మధ్యలోనే నిలిపి వేయడంతొ ఆ గ్రామాల ప్రజల ఆనందం ఆవిరైపోయింది. అదిగో...ఇదిగో అంటూ ఏకంగా ఐదేళ్లు గడిచిపోయాయి. రోడ్డు పనులు మాత్రం ఇప్పటికి ఇప్పటికి పూర్తికాలేదు.

అయితే ఈ రోడ్డుకు సంబంధించి కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక పోవడంతో పనులు నిలిపివేశారు. ఐదేళ్లుగా తారు రోడ్డు ఆయా గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి



నిలిచిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి. మట్టి రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా ఉంది. చాలా కాలంగా తారు రోడ్డు కోసం ఎదురు చూస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సల్కాపురం, సోంపురం తారురోడ్డు పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

–శంకర్, సల్కాపురం

బ్రిడ్జి లేక ఇబ్బందులు



సల్కాపురం, జోకన్‌గట్టు గ్రామాల మధ్య తారు రోడ్డు ఏర్పాటులో భాగంగా బ్రిడ్జి నిర్మాణానికి రోడ్డును తవ్వారు. దీంతో గుంతలను పూడ్చకపోవడంతో పొలాలకు వెళ్లలేకపోతున్నాం. రోడ్డు పక్కన ఉన్న నీటి కుంటలోంచి నడుచుకుంటూ అవతలి వైపు వెళ్లాల్సి దుస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.

– ఈరప్ప, సల్కాపురం

త్వరలో పనులు పూర్తి చేస్తాం

సల్కాపురం, సోంపురం తారు రోడ్డుకు సంబంధించిన పనులను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. గతంలో నిధుల విడుదలలో జాప్యం జరిగింది. దీంతో పనులు నిలిచాయి. ప్రస్తుతం కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తి చేస్తాం.

– రవీందర్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ

పీఆర్సీ విడుదల చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: గ్రామ పంచాయతీ వర్కర్లకు వెంటనే పీఆర్సీని అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ వర్కర్ల సంఘం అధ్యక్షుడు బీచుపల్లి, జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ మల్టీపర్పస్ కింద పని చేస్తున్న కార్మికులకు నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి గోవిందు, చంద్రాములు, శ్రీను, గోపాల్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంగా మారిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణం, మల్దకల్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామకృష్ణ, పూడూరు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి

గద్వాల అర్బన్: మెడికో ప్రీతి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేయాలని ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ సతీష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో పాత బస్టాండులో ఏబీవీపీ ఆధ్వర్యంలో మెడికో ప్రీతి ఆత్మహత్యకు కారణమైన నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్ వేధింపులు, విద్యార్థినులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్య, విద్య కళాశాలల్లో ర్యాగింగ్ సాధారణం అని ప్రకటించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్వేతా, జిల్లా కన్వీనర్ సురేష్, రఘువంశీ, వినోద్, ఓంకార్, తేజ, అనిల్, పవన్, అశ్విని, జ్యోతి, రాజీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మెడికో విద్యార్థి ప్రీతికి నివాళి

అయిజ: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో వైద్య విద్య చదువుతున్న గిరిజన వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని సోమవారం మండలంలోని వెంకటాపురంలో యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మూగజీవాలను కాపాడుకుందాం

అయిజ: మూగజీవాలను కాపాడుకుందామని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూప రాణి కోరారు. సోమవారం మండలంలోని బింగుదొడ్డి, సంకాపురం గ్రామాల్లో పశువైద్య సిబ్బంది మొత్తం 3334 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. మంగళవారం మండలంలోని ఎక్లాస్‌పురం, తూంకుంట గ్రామాల్లో మందులు వేస్తామని వైద్యురాలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నాయకుల నిరసన



అలంపూర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

అలంపూర్: ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా పట్టణంలోని గాంధీ చౌక్‌లో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ పథకానికి భారీగా నిధులు తగ్గించిందన్నారు. ఎరువులు, విత్తనాలకు కోత విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నిధులు తగ్గించడంతోపాటు కాజీపేట రైల్వే కోచ్ వంటి వాటికి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నరసింహ్మ, నాయకులు వెంకటస్వామి, చిన్న రాయుడు, సుంకన్న, శాషు తదితరులు ఉన్నారు.

టోకెన్లకోసం రైతుల బారులు

ఉండవెల్లి: పప్పుశనగ కొనుగోలుకు కోసం టోకెన్లు ఇస్తారని రైతులు భావించి సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాము వద్దకు బారులు తీరారు. పాస్‌బుక్కులను రైతులు క్యూలైన్‌లో ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఈ విషయాన్ని రైతులు డీఎంకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. అందరికి అందుబాటులో ఉండేవిధంగా అలంపూర్ చౌరస్తాలో కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. టోకెన్లు ఎప్పుడు ఇచ్చేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు.

ముళ్లపొదలను తొలగించాలి

గద్వాల అర్బన్: రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించాలని ఎంపీడీవో రవీంద్ర అన్నారు. సోమవారం మండలంలోని మేలచేర్వు, వీరాపురం గ్రామాల్లో ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. మేలచేర్వు, వీరాపురం గ్రామాల్లో ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించే పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ముళ్లపొదలను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చూడాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా క్రమంగా నీరు పోయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శివజ్యోతి, వీరాపురం సర్పంచు, పంచాయతీ కార్యదర్శి బాలీశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవీంద్ర

తుమ్మిళ్ల లిఫ్టు అభివృద్ధి పనులు ప్రారంభం

రాజోళి: తుమ్మిళ్ల ఎత్తిపోతల వద్ద ఎమ్మెల్యే అబ్రహం ఆదేశాల మేరకు సోమవారం ఆర్‌డీఎస్ అధికారులు పలు అభివృద్ధి పనులను చేపట్టారు. బీఆర్‌ఎస్ యువజన నాయకుడు అజయ్ ఆధ్వర్యంలో జేసీబీ, కూలీల సహాయంతో నీటి ప్రవాహానికి అడ్డు తగలకుండా పనులు చేస్తున్నారు. సీల్టును, రాళ్లను తొలగించారు. కెనాల్‌ను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఎస్ మాజీ చైర్మన్ సీతారామి రెడ్డి రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల అసత్య ప్రచారాలు

ధరూరు: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు కొనసాగుతున్నా బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మార్లబీడులో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు రాజేష్ అధ్యక్షతన 'ప్రజా గోస – బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సుకన్య సమృద్ధి యోజన పథకం, సురక్ష బీమా యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో పాటు అనేక పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టన్న, మాజీ సర్పంచు జనార్దన్‌రెడ్డి, సీనియర్ నాయకులు సంజీవ్ భరద్వాజ్, శేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, సత్యారెడ్డి, రాకేష్, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: రిజర్వాయర్లు లేకుండా తుమ్మిళ్ల ఎత్తిపోతలను కొనసాగిస్తే వ్యర్థమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని తుమ్మిళ్లలో ఎండుతున్న మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు.



మార్లబీడులో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

అనంతరం ఆయన మాట్లాడుతూ వారంలో మూడు తుమ్మిళ్ల నీరు రావడం, మరో మూడు రోజులు బంద్ కావడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. వెంటనే రిజర్వాయర్‌ను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి



మల్దకల్‌లోని పెద్దొడ్డిలో..



అయిజ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో..

మల్దకల్: కంటి వెలుగును వినియోగించుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. సోమవారం మండలంలోని పెద్దొడ్డిలో కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌కుమార్, స్వరూపరాణి, ప్రణీత, సర్పంచు సునీత, రఘుపతి, రామకృష్ణ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని మున్సిపాలిటీ సమావేశ మందిరంలో సోమవారం 19వ వార్డు ప్రజల కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు కేంద్రాన్ని పరిశీలించి వైద్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ టౌన్ ప్రసిడెంట్ మహబూబ్ బాషా, మున్సిపల్ ఏఈ గోపాల్, మేనేజర్ రాజేష్ కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని మిట్టదొడ్డి, రాయాపురం నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో సోమవారం మొత్తం 277 మందికి కంటి పరీక్షలు చేశారు. 10 మందికి కంటి అద్దాలు, మరో 24 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నరేష్, హెల్త్ సూపర్ వైజర్లు మక్బూద్, స్వర్ణలత, ఏఎన్‌ఎంలు షాహీన్, పార్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడు సోమవారం నిర్వహించిన కంటి వెలుగు కేంద్రంలో 138మందికి కంటి పరీక్షలు, 33 మందికి కంటి అద్దాలు, 15మందికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ యాకుబ్‌బాషా, కార్యదర్శి మంజుల, సిబ్బంది చంద్రన్న, శరద, చిట్టెమ్మ, దేవమ్మ, శ్రావణి, లక్ష్మీ నారాయణ, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని ఇమాంపూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో మొత్తం 142 మంది, లింగనవాయిలో మొత్తం 158 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రసూణ రాణి, రామస్వామి, హేమమానస, లక్ష్మీ కాంత్, వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

గద్వాల అర్బన్: విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కో చైర్మన్ అశోక్, కన్వీనర్ శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ డివిజినల్ ఇంజనీర్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఈపీఎఫ్, జీపీఎఫ్ సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని, ఆర్టీజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సుదర్శన్, ప్రసాద్, నాగరాజు, గాయత్రీ, విమల, లక్ష్మి, రాధిక, సనత్, మహేష్, కౌశిక్, నవీన్ తదితరులు ఉన్నారు.

బాలికలకు ప్రత్యేక రక్షణ చట్టాలు

శాంతినగర్: బాలికలకు ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. సోమవారం వడ్డేపల్లి మండల మహిళా సమాఖ్య భవనంలో మండల స్థాయి కిశోర బాలికల సమావేశాన్ని ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు, డయల్ 100, 1098, షీటీం, సఖి కేంద్రం, మొబైల్ వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీపీ రజిత మాట్లాడుతూ బాలికలు బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హనిమిరెడ్డి, నగపుల్లయ్య, కిశోరబాలిక సంఘాల లీడర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

అయిజ: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బీజేపీ అలంపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి మెడికల్ తిరుమలరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుమలరెడ్డి మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు నిర్మాణం పనులు ఆలస్యమైతే ప్రజలు ఇబ్బందులు పడుతారని దీనిని దృష్టిలో ఉంచుకొని పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. నాయకులు భీమసేనరావు, ప్రదీప్ కుమార్, నరసింహయ్యశెట్టి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాజోళి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండల కేంద్రంలోని భ్రమరాంబ ఆదిశ్వేర స్వామి జాతర ఉత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు సంబరాలు సంతోషకరమన్నారు. రైతుబంధు, రైతుబీమా, వివిధ సంక్షేమ పథకాలతో రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారనన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. నంద్యాలకు చెందిన భూమా గోవర్ధన్ రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. విజేతకు రూ.50వేలు అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన కృష్ణాపురానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి ఎద్దులు నిలిచాయి. మాజీ సర్పంచ్ శ్రీరామ్ రెడ్డి, కున్నూర్ సర్వేశ్వర్ రెడ్డి, కుర్వ గోరోజిలు కలిసి రూ.40 వేలు బహుమతి ఇచ్చారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

మూడు, నాలుగు, ఐదు, ఆరో స్థానంలో నిలిచిన వారికి వరుసగా రూ.30వేలు, 20 వేలు, 10వేలు, 5వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు అజయ్, మాజీ సర్పంచ్ శ్రీరామ్ రెడ్డి, గంగి రెడ్డి, భూషణం, చంద్ర గౌడ్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయని కలెక్టర్‌కు వినతి

గద్వాల రూరల్: ఆర్డీఎస్ కింద సాగుచేసిన పంటలు నీళ్లు రాకపోవడంతో ఎండుతున్నాయని ఆర్డీఎస్ రైతులు సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. 20 రోజులుగా పంటలకు నీరు అందకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయని అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆర్డీఎస్ ఇంజినీరింగ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో యూత్‌ఫర్ పబ్లిక్ సంస్థ ప్రతినిధి శేషు, రైతులు పాల్గొన్నారు.

జాతర ఉత్సవాలు

ఆత్మకూర్: పట్టణంలోని చెరువులో వెలిసిన శ్రీస్వయంభూ పరమేశ్వరస్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రా భిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు.